క్లుప్తంగా

ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులను నియంత్రించండి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

పాల్వంచ: ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజులను నియంత్రించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బుర్ర వీరభద్రం అన్నారు. శుక్రవారం డీఈఓ కార్యాలయంలో జిల్లా ప్రభుత్వ పరీక్షల సహాయక కమిషనర్ ఎస్.మాధవ రావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వీరభద్రం జిల్లాలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న పాఠశాలలు, కళాశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. పుస్తకాలు, యూనిఫాం, స్పోర్ట్స్ డ్రస్‌ల మెటీరియల్ పేరుతో దోపిడీకి పాల్పడుతున్నట్లు చెప్పారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు బోడ అభిమిత్ర, జమ్మి యశ్వంత్‌తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన

టేకులపల్లి: సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కందుల దినేష్ ఆదేశానుసారం క్షేత్రస్థాయి వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం మండల వ్యాప్తంగా ఫ్రైడే డ్రైడే కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించారు. దోమలు వృద్ధి చెందకుండా తగు చర్యలపై అవగాహన కల్పించారు. ఇంటింటికి తిరిగి రాబోయే వర్షాకాలంలో వచ్చే అంటు వ్యాధులైన టైఫాయిడ్, వాంతులు విరోచనాలు, కామెర్లు తదితర వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నంద్యాతండా, నారాయణతండా, చుక్కాలబోడు రేగుల తండా తదితర గ్రామాల్లో ఈ కార్యక్రమాలను ఇల్లందు సబ్ యూనిట్ అధికారి హరికృష్ణ ఆకస్మికంగా తనిఖీ చేసి సిబ్బందికి తగు సూచనలు చేశారు.

చేపమందులో శాస్త్రీయత లేదు

పాల్వంచ: హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న చేపమందులో ఎలాంటి శాస్త్రీయత లేదని, గతంలో చేప మందును నిలిపివేయాలని కోర్టు తీర్పు ఇచ్చిందని శాస్త్రీయ అధ్యయన వేదిక రాష్ట్ర కన్వీనర్ చార్వాక అన్నారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చేప మందు పేరుతో ప్రభుత్వం కోట్లాది రుపాయల ప్రజల డబ్బును దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. మూఢ నమ్మకాల నిర్మూలన చట్టాన్ని తీసుకొచ్చి ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం అమలు చేసేందుకు కృషి చేయాలన్నారు. చేప మందు వల్ల ఎలాంటి అనారోగ్యాలు తగ్గవని చెప్పారు. షేక్.నబీ, ఆంజనేయులు, మధుసూదన్, ప్రశాంత్ పాల్గొన్నారు.

డీఎఫ్ఓను కలిసిన ఎమ్మెల్యే

ఇల్లెందు: మండలంలో రెండు ముఖ్యమైన రోడ్లకు అనుమతి కోసం డీఎఫ్ఓ లక్ష్మణ్‌రంజిత్‌ను ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియ శుక్రవారం కలిశారు. పూబెల్లి నుంచి దండగుండాల రోడ్డు 2.94 కిలోమీటర్లు రూ. 1.90 కోట్లతో, తుంటిబాలు తండా నుంచి బోయితండా మీదుగా పోచారం తండా వరకు 4.6 కిలోమీటర్లు రూ.3.40 కోట్లతో చేపడుతున్నారు. నాలుగేళ్లుగా అనుమతి కోసం నిర్మాణాలు పెండింగ్‌లో ఉన్నాయి. ఒక్కో రోడ్డుకు హెక్టార్ భూమి అవసరం అవుతుంది.

‘మన సంక్షేమం’ దేశానికే రోల్ మోడల్



చుంచుపల్లి: గొల్ల, కురుమలకు గొర్రెలు పంపిణీ చేస్తున్న కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు



ఇల్లెందు: యాదవులకు గొర్రెల యూనిట్లు అందజేస్తున్న ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియ

చుంచుపల్లి: తెలంగాణలో సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏ రాష్ట్రంలోనూ అమలు కావడం లేదని, దేశానికే రోల్ మోడల్‌గా నిలిచాయని కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం చుంచుపల్లి ఎన్‌కే నగర్‌లోని కమ్మ సేవా సత్రంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా సంక్షేమ సంబరాల్లో పాల్గొన్నారు. పేదలకు ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలు రాష్ట్రంలో ప్రతి ఊరు, ప్రతి గడపకు అందించిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని చెప్పారు. కార్యక్రమంలో వనమా రాఘవేంద్రరావు, జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, ఎంపీపీలు బాదావత్ శాంతి, భూక్యా సోనా, మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్యా రాంబాబు, ఆత్మ కమిటీ చైర్మన్ బత్తుల వీరయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ దామోదర్, ఐసీడీఎస్ సీడీపీఓలు లెనీనా, కనకదుర్గ, పశువర్ధక శాఖ అధికారి పురేందర్, తహసీల్దార్లు వనం కృష్ణ ప్రసాద్, నాగరాజు, ఎంపీడీఓ మంగమ్మ, ఎంపీఓ సత్యనారాయణ తదితరులుపాల్గొన్నారు.

గొర్రెలు పిల్లలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే...

చుంచుపల్లి మండలం ఎన్‌కే నగర్ గ్రామపంచాయతీలోని కమ్మ సేవా సంఘంలో శుక్రవారం కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. లబ్ధిదారులకు గొర్రెల యూనిట్లు పంపిణీ చేశారు. మాట్లాడుతూ... గొల్ల, కురుమలను ఆర్థికంగా అభివృద్ధి చేయడమే ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో వనమా రాఘవేంద్రరావు, జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, ఎంపీపీలు బాదావత్ శాంతి, సోనా, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఆర్టీసీని ఆదరిద్దాం..

ప్రజా రవాణలో కీలకంగా వ్యవహరిస్తున్న టీఎస్ ఆర్టీసీ మరిన్ని లాభాలు ఆర్జించే విధంగా అందరం ఆదరిద్దామని కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం కొత్తగూడెం బస్టాండ్‌లో విలేజ్ బస్ ఆఫీసర్ల వ్యవస్థను ప్రారంభించారు. మాట్లాడుతూ.. మూడేళ్లుగా ఆర్టీసీలో పలు సంస్కరణల ద్వారా సంస్థను లాభాల పట్టించే యత్నాలు జరుగుతున్నాయన్నారు. శుభకార్యాలకు బస్సులతో పాటు ఆర్టీసీ అందించే పలు రాయితీలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఇల్లెందు: ప్రజల కష్టాలను తీర్చేందుకు అభివృద్ధి సంక్షేమం సమపాళ్లలో అమలు చేసిన సీఎం కేసీఆర్‌ను తెలంగాణ ప్రజలెప్పటికీ మర్చిపోరని, ముచ్చటగా మూడోసారి కేసీఆర్‌ను సీఎం గద్దెనెక్కిస్తారని ఎమ్మెల్యే హరిప్రియ అన్నారు. శుక్రవారం పట్టణంలోని మార్కెట్ యార్డులో తెలంగాణ సంక్షేమ సంబురాల కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. తొమ్మిదేళ్లు పాలన ముగించుకుని పదోఏటా అడుగు పెడుతున్న వేళ ఇప్పటి వరకు ఎన్నో పథకాలు అమలు జరుగుతున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా గొల్ల కురమలకు గొర్రెల యూనిట్లను పంపిణీ చేశారు. పశుసంవర్ధక శాఖ ఏడీ విజయ మాట్లాడుతూ.. 40 మంది రైతులకు గడ్డి కటింగ్ యూనిట్లు అందజేయగా 75శాతం సబ్సిడీతో గడ్డి విత్తనాలు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో మహబూబాబాద్ జెడ్పీ చైర్మన్ అంగోతు బిందు, జిల్లా గ్రంథాలయ కమిటీ చైర్మన్ దిండిగల రాజేందర్, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ సయ్యద్ జానీపాషా, అధికార ప్రతినిధి పులిగళ్ల మాధవరావు, తహసీల్దార్ కృష్ణవేణి, ఎంపీడీఓ బాలరాజు, కమిషనర్ అంకుషావలీ, డీసీసీబీ డైరెక్టర్ జనగం కోటేశ్వరరావు, సొసైటీ చైర్మన్ చిదంబరం, మెట్ల కృష్ణ, లాల్ సింగ్, ఆత్మకమిటీ చైర్మన్ బావుసింగ్, తహసీల్దార్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

కుంగిపోవద్దు.. అండగా ఉంటాం..

ఇల్లెందురూరల్: తల్లిదండ్రులను కోల్పోయామని కుంగిపోవద్దు.. తామంతా అండగా ఉంటామని రోడ్డు ప్రమాద బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ భరోసానిచ్చారు. మండలంలోని సుభాష్‌నగర్ గ్రామపంచాయతీ లలితాపురం గ్రామానికి చెందిన నిడికొండ సుబ్బారావు, లలిత దంపతులు గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పొందిన విషయం తెలిసిందే. శుక్రవారం లలితాపురం గ్రామంలోని వారి కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. ప్రమాద ఘటన వివరాలు కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా తమను సంప్రదించి సహాయం పొందాలని సూచించారు. వైస్‌ఎంపీపీ దాస్యం ప్రమోద్‌కుమార్, యలమద్ది రవి, ఆళ్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఏపీజీవీబీ సేవలను సద్వినియోగం చేసుకోండి

టేకులపల్లి: ఏపీజీవీబీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఏపీజీవీబీ సీనియర్ మేనేజర్ ఆపరేషన్ నెహ్రూ, లీడ్ బ్యాంకు మేనేజర్ రామిరెడ్డి అన్నారు. శుక్రవారం ఎర్రాయిగూడెం గ్రామంలో బోడు బ్రాంచ్ అధ్వర్యంలో ఆర్థిక అవగాహన సదస్సు నిర్వహించారు. బ్యాంక్ వివిధ స్కీంల గురించి వివరించారు. ఏపీజీవీబీలో రూ.1000 జనరల్ ఇన్సూరెన్స్ చేసి కొన్ని నెలల క్రితం ప్రమాదంలో మరణించిన ఈసాల స్వామి భార్య రాములమ్మకు రూ.20,00000 చెక్ అందజేశారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ సునీల్, బోడు బ్రాంచ్ మేనేజర్ చంద్రశేఖర్, సర్పంచ్ నిర్మల పాల్గొన్నారు.

12న ‘చలో కలెక్టరేట్’ను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న మంగీలాల్

ఇల్లెందురూరల్: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను నిరసిస్తూ ఈ నెల 12న జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహిస్తున్న ధర్నాను జయప్రదం చేయాలని ప్రజాపంథా నేత, ఎంపీటీసీ అజ్మీర బిచ్చా, భూక్యా మంగీలాల్ పిలుపునిచ్చారు. మండలంలోని కొమరారం గ్రామంలో దశాబ్ది ఉత్సవాలను నిరసిస్తూ శుక్రవారం ప్రదర్శన నిర్వహించారు. గ్రామ శివారులోని ఉపాధి హామీ పనుల వద్ద కూలీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో సీఎం కేసీఆర్ విఫలమయ్యారని విమర్శించారు. మిగులు రాష్ట్రంగా ఆవిర్భవించిన తెలంగాణకు రూ.5లక్షల కోట్ల అప్పుల భారం మోపారని ఆరోపించారు. నిరుద్యోగ భృతి, రుణమాఫీ, రేషన్‌కార్డులు, ఇంటింటికీ ఉద్యోగం, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, లక్ష ఎకరాలకు సాగునీరు తదితర అనేక హామీలు నీటిమీద రాతల్లా మారాయన్నారు. రాష్ట్రంలో నిరంకుశ పాలన సాగిస్తూ పేదలకు అందాల్సిన పథకాలను దూరం చేశారని ధ్వజమెత్తారు. ఇలాంటి పాలన సాగిస్తూ దశాబ్ది ఉత్సవాలను నిర్వహించడం సిగ్గుచేటన్నారు. శాంతారావు, ధరావత్ దేవా, పద్మ, కృష్ణవేణి, భాగ్యమ్మ, ఈది, పూలియా, భీముడు, సీతారాం, వీరన్న పాల్గొన్నారు.

బాలకార్మికులతో పని చేయించొద్దు



అవగాహన కల్పిస్తున్న కృపావేణి

కొత్తగూడెంరూరల్: బాల కార్మికుల వ్యతిరేక దినోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల, పాల్వంచ మండలం జగన్నాథపురం, చుంచుపల్లి మండలం పెనుబల్లి, సుజాతనగర్ మండలం లక్ష్మీతండా, పాత కొత్తగూడెం నిర్వహించారు. బాలల హక్కుల ప్రజాధ్వని రాష్ట్ర అధ్యక్షురాలు కెడెం కృపావేణి ఆధ్వర్యంలో శ్రామిక వికాస కేంద్రం సంయుక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పిల్లలందరినీ పాఠశాలలకు తప్పనిసరిగా పంపించాలని, బజార్‌లోని షాపులలో, బేకరీలో పిల్లలతో పని చేయించరాదని చెప్పారు. పిల్లలను బలవంతంగా పనిలో పెట్టుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడైనా ఎవరికైనా బాలకార్మికులు పని చేస్తున్నట్లయితే 1098, 100 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. ఈ బాల కార్మికుల వ్యతిరేక దినోత్సవం ఈనెల 12వ తేది వరకు జరుగుతుందన్నారు.

ఆక్రమణల తొలగింపు

పాల్వంచ: మున్సిపాలిటీలో ఆక్రమణలను సంబంధిత అధికారులు తొలగించారు. ఎంపీడీఓ కార్యాలయం రోడ్డులో వ్యాపారాలు చేసుకునేందుకు కొత్తగా డబ్బాలను ఏర్పాటు చేశారు. దీంతో వాటివల్ల ట్రాఫిక్ ఇబ్బందులు ఉండే అవకాశం ఉందని మున్సిపల్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ ఆధ్వర్యంలో శుక్రవారం వాటిని తొలగింపు చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్‌రావు, జవాన్లు, పాల్గొన్నారు.

ప్రజాగర్జన సభను విజయవంతం చేయండి

టేకులపల్లి: ఈనెల 11న లక్ష మందితో కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో జరగనున్న సీపీఐ ప్రజాగర్జన బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర నాయకుడు కాశబోయిన సారయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యుడు గుగులోత్ రాంచందర్ నాయక్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేసేంత వరకూ పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తూనే ఉంటామన్నారు. దళితబంధుతో పాటు గిరిజన బంధు కూడా అమలు చేయాలని కోరారు. నిరుపేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వాలని, సొంత స్థలం ఉన్న వారికి ఇంటి నిర్మాణం కోసం రూ.6 లక్షలు అందజేయాలని, కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, గ్యాస్, డీజిల్ ధరలు తగ్గించాలని, రైతులందరికీ రూ.లక్ష రుణమాఫీ చేయాలని, సింగరేణి కాంట్రాక్టు కార్మికులను పర్మనెంట్ చేయాలని, అవుట్ సోర్సింగ్ కార్మికులకు ఒకటో కేటగిరి జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దేవరకొండ శంకర్, మోజెస్, ఎజ్జు భాస్కర్, శ్రీను, వాసం భద్రయ్య, శ్రీరాములు, వీరన్న, పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

టేకులపల్లి: టేకులపల్లి, కోయగూడెం ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టేకులపల్లి విద్యుత్ శాఖ ఏఈ హెచ్.దేవా శుక్రవారం రాత్రి తెలిపారు. టేకులపల్లి, కోయగూడెం విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో మరమ్మతులు చేపడుతున్న కారణంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

మాటలను కోటలు దాటిస్తున్నారు..



మాట్లాడుతున్న కామేష్

కొత్తగూడెంఅర్బన్: ఎన్నికలు సమీపించగానే ప్రజాకర్షక పథకాలను ప్రవేశపెట్టి అధికారంలోకి వచ్చాక వాటిని తొక్కి పెట్టడంలో కేసీఆర్ దిట్ట అని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ విమర్శించారు. తెలంగాణలో సంక్షేమ సంబరం పేరుతో జరుగుతున్న నాటకాలను ఎండగడుతూ శుక్రవారం పార్టీ కార్యాలయంలో మహిళా కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సంందర్భంగా కామేష్ మాట్లాడుతూ.. 2018 ఎన్నికలకు ముందు కేసీఆర్ కిట్ అని నానా హంగామా చేసి ఆడపిల్ల పుడితే రూ.13 వేలు, అబ్బాయి పుడితే రే.12వేలు ఇస్తామని చెప్పి నేటికీ మూడేళ్లుగా కేసీఆర్ కిట్‌కు నిధులు మంజూరు చేయడం లేదని, మళ్లీ ఇప్పుడు కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ అంటూ కొత్త నాటకానికి తెరలేపుతున్నారని ఆరోపించారు. జిల్లాలో కేసీఆర్ కిట్ డబ్బులు రావాల్సిన బాధితులకు పదివేల మందికి పైగా చంటి పిల్లల తల్లులు కేసీఆర్ మాటలు నమ్మి మోసపోయారని, రాష్ట్ర వ్యాప్తంగా కేసీఆర్ కిట్టు డబ్బులు లక్షల మందికి ఇవ్వాల్సి ఉందని ఇక ఇస్తారనే ఆశ కూడా వారికి లేదన్నారు. తొమ్మిదేళ్ల కాలంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల సంక్షేమానికి ఎన్ని నిధులు కేటాయించారు? ఎన్ని నిధులు ఖర్చు చేశారో ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సంక్షేమ పాలన అంటే బహుజనులకు సరైన నిధులు కేటాయించకపోవడం, కేటాయించిన నిధులను కూడా ఖర్చు చేయకపోవడమా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో షేక్ కరిష్మా, ఇస్లావత్ కల్యాణి, సందేల నిర్మల, బానోత్ భూమిక తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సమస్యల పరిష్కారానికి జాతా



మాట్లాడుతున్న వెంకటమ్మ

ఇల్లెందు: అంగన్‌వాడీ కేంద్రాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని అంగన్‌వాడీ వర్కర్ అండ్ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఈసం వెంకటమ్మ డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 16 నుంచి జాతా ప్రారంభం అవుతుందని, విజయవంతం చేయాలని కోరారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం అందజేయాలని, పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ అమలు చేయాలని కోరారు. జూన్ 9 నుంచి 13 వరకు అంగన్‌వాడీ కేంద్రాలలో సర్వేలు, జులై 10న డిమాండ్ డే, జూన్ 16న జాతా సాగుతుందని తెలిపారు. అబ్దుల్ నబీ, కృష్ణ, మరియ, ఫాతిమా, యాకమ్మ, వెంకటమ్మ, రమాదేవి, సంధ్య, పద్మ, వెంకటరమణ, రమాదేవి పాల్గొన్నారు.

● రోడ్లు నిర్మానుష్యం



పెద్దమ్మగుడి వద్ద నిర్మానుష్యంగా జాతీయ రహదారి

మృగశిర కార్తె వచ్చినా భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. బీసీఎం జాతీయ రహదారి శుక్రవారం మధ్యాహ్నం నిర్మానుష్యంగా మారింది. ఉదయం 10 గంటల నుంచే ఎండ తీవ్రత చూపుతోంది. దీంతో ప్రజలు ఇళ్లలో నుంచి బయటకు రావాలంటే జంకుతున్నారు. మండలంలోని కేశవాపురం, జగన్నాథపురం, పెద్దమ్మగుడి వద్ద నిత్యం రద్దీగా ఉన్న బీసీఎం జాతీయ రహదారిపై ఎండతీవ్రంగా ఉండటంతో వాహనాల రాకపోకలు లేకపోగా జనసంచారం కూడా లేదు. దీంతో ఈ ప్రాంతం వెలవెలబోయింది. ఎండల తీవ్రత ఇంకా ఎన్నిరోజులు ఉంటాయోనని ప్రజలు కలవరం చెందుతున్నారు. – పాల్వంచరూరల్

సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ అయ్యేనా?

- వైద్య విధాన పరిషత్‌లో విలీన ప్రక్రియ ప్రతిపాదనలకే పరిమితం
- నిరుపేదలకు అందుబాటులోకి రాని మెరుగైన వైద్యం



సీహెచ్‌సీలో వైద్యసేవలు పొందుతున్న రోగులు


జూలూరుపాడు: జూలూరుపాడు పీహెచ్‌సీ ప్రాంగణంలో ప్రభుత్వం 21 ఏళ్ల క్రితం నిర్మించిన 30 పడకల ఆస్పత్రి భవనంలో 2012 నుంచి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) అనధికారికంగా నడుస్తోంది. ఆనాటి నుంచి సీహెచ్‌సీగా కొనసాగుతున్నప్పటికీ వైద్యవిధాన పరిషత్‌లో విలీనం కాకపోవడంతో అప్‌గ్రేడ్‌కు నోచుకోలేదు. సీహెచ్‌సీ అప్‌గ్రేడ్ అయితే అన్ని రకాల వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయి. సీహెచ్‌సీ అప్‌గ్రేడ్‌కు ప్రతిపాదనలను అధికార యంత్రాంగం ప్రభుత్వానికి పంపినప్పటికీ కార్యరూపం దాల్చడం లేదు. జిల్లాలోని చర్ల, జూలూరుపాడు పీహెచ్‌సీలను సీహెచ్‌సీలుగా మార్చాలనే ప్రతిపాదనలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అందులోభాగంగా కలెక్టర్ ఆదేశాల 2022లో వైద్యవిధాన పరిషత్ జిల్లా పర్యవేక్షణ అధికారి డాక్టర్ రవిబాబు 30 పడకల ఆస్పత్రి భవనాన్ని సందర్శించి, సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీసీహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు మాట్లాడుతూ.. వైద్య విధాన పరిషత్‌లోకి మార్చేందుకు ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందించనున్నట్లు చెప్పారు. అయినా ఎలాంటి పురోగతి లేదు. 30 పడకల ఆస్పత్రి కోసమని రూ.లక్షలతో భవనాన్ని నిర్మించారు గానీ, అప్‌గ్రేడ్‌కు నోచుకోకపోవడంతో సాధారణ వైద్య సేవలే అందుతున్నాయి. దీంతో మెరుగైన వైద్య సేవల కోసం రోగులు ఖమ్మం, కొత్తగూడెం తదితర పట్టణ ప్రాంతాల్లోని ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లాల్సిన దయనీయ పరిస్థితి నెలకొంది. జూలూరుపాడు మండల పరిసర ప్రాంతాల గిరిజన ప్రజలు ఎన్నో ఏళ్లుగా మెరుగైన వైద్య సేవలు కల్పించాలని కోరుతున్నారు. అనేక ప్రజా సంఘాలు, పార్టీలు ఆందోళనలు నిర్వహించి వినతి పత్రాలు అందజేశారు. ప్రస్తుత ఎమ్మెల్యే, గతంలోని ఎమ్మెల్యేలు అప్‌గ్రేడ్‌కు కృషి చేస్తామని ఇచ్చిన హామీలు అటకెక్కాయి. ఇప్పటికైనా ప్రస్తుత రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, స్థానిక ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్, ఎమ్మెల్సీ తాతా మధులు సీహెచ్‌సీ అప్‌గ్రేడ్ అయ్యే విధంగా కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సీహెచ్‌సీ అప్‌గ్రేడ్‌తో అందుబాటులోకి వచ్చే సేవలు

సీహెచ్‌సీగా ఏర్పాటు చేస్తే అన్ని రకాల వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయి. ప్రస్తుతం డెంటల్ డాక్టర్ ఉండటంతో స్త్రీ వైద్యనిపుణులు, శస్త్ర చికిత్స నిపుణులు, పిల్లల వైద్యనిపుణులు, ఆర్థోపెడిక్, అనస్థీషియా, రేడియా గ్రాఫర్, ఫార్మసిస్ట్, డార్క్ రూమ్ అసిస్టెంట్, ఏఎన్ఎం, అటెండర్లలను నియమించాల్సి ఉంటుంది.

ప్రస్తుతం సీహెచ్‌సీ పరిధిలో పని చేస్తూ డిప్యూటేషన్‌పై వెళ్లిన మెడికల్ ఆఫీసర్, ఇద్దరు స్టాఫ్ నర్సులను తిరిగి ఇక్కడ విధులు నిర్వర్తించే విధంగా చర్యలు తీసుకోవాలి. ప్రస్తుతం బెడ్‌లు అందుబాటులో ఉన్నప్పటికీ యంత్ర పరికారాలను సమకూర్చాల్సి ఉంటుంది. ఏళ్లు గడుస్తున్నా 30 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ కాకపోవడంతోపాటు, పోస్ట్‌మార్టమ్ మార్చురీ కోసం నిర్మించిన భవనం నిరుపయోగంగా మారింది. ఈ భవనాన్ని ప్రస్తుతం కోవిడ్ పరీక్షలకు ఉపయోగిస్తున్నారు. సీహెచ్‌సీలోని ఆపరేషన్ థియేటర్‌లోని యంత్ర పరికరాలు తుప్పుపట్టి, దుమ్ము, ధూళి, బూజు పట్టి నిరుపయోగంగా ఉన్నాయి. 30 పడకల ఆస్పత్రి భవనాన్ని వైద్య విధాన పరిషత్‌కు అప్పగిస్తే ప్రస్తుతం ఈ భవనంలో కొనసాగుతున్న పీహెచ్‌సీ అక్కడ నుంచి ఇతర ప్రాంతాలకు తరలించే అవకాశం ఉంది. కొత్తగా ఆస్పత్రి భవనాన్ని నిర్మించేందుకు రూ.1.20 కోట్లు మంజూరుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిసింది.


అప్‌గ్రేడ్ చేయాలి



పీహెచ్‌సీని సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ చేయాలి. ఇరవై ఏళ్ల క్రితం 30 పడకల ఆస్పత్రి కోసం భవనాన్ని నిర్మించారు గానీ అప్‌గ్రేడ్‌కు చేయలేదు. సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేసి, వినతిపత్రాలు అందజేశాం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రజలకు మెరుగైన వైద్యం అందేలా చూడాలి.

– గుండెపిన్ని వెంకటేశ్వర్లు, జూలూరుపాడు


దృష్టి సారించాలి



ఆస్పత్రి అప్‌గ్రేడ్ కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలి. పీహెచ్‌సీని సీహెచ్‌సీగా విస్తరించడంతోపాటు వైద్యులు, వైద్యసిబ్బందిని నియమించి, యంత్ర పరికరాలను సమకూర్చాలి. సీపీఎం ఆధ్వర్యంలో పలు ఆందోళనలు చేపట్టాం.

– యాసా నరేష్, జూలూరుపాడు

ప్రతిపాదనలు పంపించాం



సీహెచ్‌సీ ఏర్పాటు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాము. త్వరలో వైద్య విధాన పరిషత్‌లో విలీనం అవుతుంది. ప్రస్తుతం ఇక్కడ కొనసాగుతున్న పీహెచ్‌సీని మరోచోటుకు తరలించేందుకు ప్రతిపాదనలు పంపించాం. ప్రస్తుతం ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నాం.

– డాక్టర్ రాకేష్ కుమార్, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్

అటెన్షన్ ప్లీజ్

దశాబ్దాలుగా ఎదురు చూపులు..

టేకులపల్లి మండల కేంద్రంలో ప్రధాన రహదారి నుంచి ప్రభుత్వ జూనియర్ కాలేజీ, వ్యవసాయ మార్కెట్ యార్డు వరకు పక్కా రోడ్డు లేకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ మార్గం గుండానే వెలుగు కార్యాలయం, ఆరోగ్య ఉపకేంద్రం, ప్రభుత్వ జూనియర్ కాలేజీ, వ్యవసాయ మార్కెట్ యార్డులకు వెళ్లాల్సి ఉంటుంది. మొత్తం కచ్చా రోడ్డులో అడుగడుగునా గుంతలు, వర్షం పడితే ఇక అంతే సంగతులు. ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు మారుతున్నా ఈ రోడ్డుకు మాత్రం మోక్షం లభించడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి మెయిన్ రోడ్ నుంచి వ్యవసాయ మార్కెట్ యార్డు వరకు పక్కా రోడ్డు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. - టేకులపల్లి



ప్రశ్నించాల్సిన అధికారి : కోట వీరబాబు, ఎంపీడీఓ, టేకులపల్లి
సెల్ నెంబర్: 92814 79238